20082024-DIS-04_Layout 1 8/20/2024 2:17 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

మనింట్లో మన అమ్మ

మన ముంగిట్లో మన చెట్టు
మనింట్లో మన అమ్మ
ఆ తర్వాతే ఎవరైనా...
తోవకు తంగేడు పూలెట్లనో
భాగ్యనగరానికి చార్మినారెట్లనో
సచివాలయం ముందల తెలంగాణ తల్లి!

అమ్మ నాయన యాదిలో
బిడ్డలకు అవ్వయ్య పేర్లే పెడుతం
ఊరులవున్న పేర్లన్నీ పెడుతమా?
మనింటికి
మన అమ్మనాయినలే
వెలుగు దివ్వెలు

ఉనికికి
ఎడంచేతి పనులు
ఎటమటం వ్యవహారాలు
తోటలో పావురాలు ఎన్నో
వాటి పాత్రలు వాటివే... గౌరవించాల్సిందే!
మన దర్వాజకు మన కాకతీయ తోరణం!

అరవై ఏండ్ల స్వేచ్ఛకై మట్టి పిడికిలెత్తింది
సబ్బండ వర్గాలు మానవహారాలైండ్రు
సకల జనుల దుఃఖం సాగరహారమైంది
జమ్మిచెట్టున పాలపిట్టలా
గెలిచి నిలిచిన వాకిట్ల తల్లి విగ్రహం ఉండాలి
మన కడపకు మన బొట్టె అందం

మహోద్యమం ఉప్పెనలై ఉరికిన నేలన
పాటపాడితే పొలంల నారు వడాలి
రాస్తే శిలకు ప్రాణం రావాలి
కాలువతీస్తే చెరువు శిఖం మురవాలి
మన వాకిట్ల మన మందారం పరిమళించాలి
మన గనుమల మన తల్లి సూర్యబింబం

అవినీతిని నిర్మూలించి
న్యాయానికి వారధై నిలువు
ఆకలిని వెంటాడి వేటాడి
పదిమంది కడుపునింపు
చరిత్రను నిర్మించు
మహనీయులను గౌరవించు
రాయబడని వెలుగుల్ని లిఖించు

అవకాశం కోసం
ఆశయాలకు పిండాలు
అధిష్ఠానం మెప్పుకై
మతిలేని పాకులాటలు
వెలుగు కుర్చీమీదుండి
చీకట్లకు తోసెయ్యడం ప్రజాస్వామ్యమా?

రత్నాన్ని తీసి రాయిని పాతాలె
చెరువును పూడ్చి బోరింగ్ ఏయాలె
మార్పంటే ఆనవాళ్లను చెరిపేయడమా?
యాపకు రంగేస్తే
మామిడి అవుతుందా?
పేరును మార్చితే
దొంగ దేశభక్తుడవుతాడా?

పేరును మార్చినోడు
ఊర్లను మార్చుతడు
జిల్లాలను కూడా...
మార్చుతడు
పేర్లు, తావులను
యాది మర్సెటట్లు
ఉమ్మడి కుట్రలకు
సలువచేస్తున్నడు
నీ వెలుగు కోసం
చీకట్ల ఉండాలా?

మహనీయులే లేనట్లు
అమరులే గొడ్డుపోయినట్లు
చంద్రవంకల జాడలే లేనట్లు
పరిపాలన గుండె
ఎదుట పరాయి విగ్రహం
అనాలోచిత చర్యలకు ప్రతిరూపం
తెలంగాణ అస్తిత్వ
గౌరవానికి సమాధి

తెలంగాణ తల్లికి కిరీటం
బంగారు కిరీటమని
చేతిలో మక్కజొన్న కంకికాదు
బంగారు కంకని
పట్టుచీర కట్టడానికి
అంత ధనవంతురాలా? అని
దొరల తల్లని... గడీల తల్లని?
తెలంగాణతల్లే కాదని ఎద్దేవా చేసి
ఎదలను చించుకున్నోళ్లంతా
ఎవరి సంకల్లో సేదతీరిండ్రు
ఏ చెట్టు నీడన ఉయ్యాలలూగుతూ
ఎవరి బూట్లకు లేసులు తొడుగుతున్నరు
వినండి! మిత్రులారా!మాట్లాడుదాం!!
తెలంగాణ తల్లికి అస్తిత్వ అక్షరమై సాగుదాం!!

(సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహం ప్రతిష్ఠించాలని కోరుతూ...)

వనపట్ల సుబ్బయ్య
94927 65358



తెలంగాణ తల్లి కోసం..

సెక్రటేరియట్ ముందు తెలంగాణ తల్లి విగ్రహం ఉండటమే చారిత్రక న్యాయం!

(లోక్‌సభలో ప్రతిపక్ష నేత, ఎంపీ శ్రీ రాహుల్‌గాంధీ గారికి తెలంగాణ కవులు, కళాకారులు, రచయితలు, పాత్రికేయులు, బుద్ధిజీవుల పక్షాన బహిరంగ లేఖ)

తెలంగాణ అస్తిత్వ వైభవానికీ, స్వరాష్ట్ర ప్రతిపత్తికీ, స్వాభిమానానికీ, సాధికారతకు ప్రతీక తెలంగాణ తల్లి. తెలంగాణ తల్లి ప్రస్తావన ఈనాటిది కాదు, తెలంగాణ రైతాంగ పోరాటం కాలంలోనే దాశరథి, రావెళ్ళ వెంకటరామారావు వంటి కవులెందరో తెలంగాణ తల్లిని ప్రస్తుతిస్తూ పద్యాలూ, పాటలూ రచించారు. ఉమ్మడి రాష్ట్రంలో నిరాదరణకు గురైన తెలంగాణ తల్లి భావన తిరిగి మలిదశ తెలంగాణ ఉద్యమంలో పునర్జీవం పొందింది. సమైక్యవాదులు తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షకు విరుద్ధంగా, సమైక్య రాష్ట్ర ప్రతీకగా తెలుగుతల్లిని నిలిపే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో తెలంగాణ బుద్ధిజీవులూ, సాహిత్యకారులూ, కళాకారులూ తెలంగాణ తల్లి రూపురేఖలను గురించి చర్చించటం ప్రారంభించారు. చర్చల పర్యవసానంగా తెలంగాణ తల్లి ఇప్పుడున్న విధంగా రూపుదాల్చింది. ఉద్యమకారులు స్వచ్ఛందంగా తెలంగాణ ఎల్లెడలా వేలాది విగ్రహాలను ప్రతిష్ఠించుకున్నారు. కనుక తెలంగాణ తల్లి ఈ మట్టిలోనుంచి, తెలంగాణ ఉద్యమ భావోద్వేగాల నుంచి పుట్టిన అస్తిత్వ ప్రతీక.

సమైక్య రాష్ట్ర అస్తిత్వ ప్రతీకగా తెలుగుతల్లి విగ్రహం గతంలో సెక్రటేరియట్ ముందు ఉండేది. తెలంగాణ స్వరాష్ట్రం సిద్ధించి నూతన సెక్రటేరియట్ భవనం కూడా నిర్మాణమైన నేపథ్యంలో, నేడు తెలంగాణ సెక్రటేరియట్ ముందు తెలంగాణ తల్లి విగ్రహం ఉండటం చారిత్రక న్యాయం. సెక్రటేరియట్‌కు అమరవీరుల స్మారక కేంద్రానికి మధ్యనున్న స్థలంలో తెలంగాణ తల్లిని ప్రతిష్ఠించాలని తెలంగాణ కవులు, కళాకారులు, పాత్రికేయుల పక్షాన శ్రీరాహుల్‌గాంధీ గారికి విజ్ఞప్తి చేస్తున్నాం. సెక్రటేరియట్ ఎదురుగా తెలంగాణ తల్లిని పెట్టాల్సిన చోట భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని పెట్టాలనే ప్రభుత్వ ఆలోచన పట్ల మాకు అభ్యంతరాలున్నాయని తెలియజేస్తున్నాం. రాజీవ్‌గాంధీ గారి మీద మాకు గౌరవం ఉంది. నగరంలో ఆయన విగ్రహం పెట్టాలనే ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వ ఆలోచన పట్ల మాకేమీ అభ్యంతరం లేదు. అయితే, సెక్రటేరియట్ ముందు తెలంగాణ తల్లి ఉండవలసిన చోట కాకుండా మరెక్కడైనా ప్రతిష్ఠించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం. తెలంగాణ తల్లి విగ్రహాన్ని సెక్రటేరియట్ ముందు నెలకొల్పినప్పుడే తెలంగాణ అస్తిత్వ ప్రతీకకు కావాల్సిన సాధికారత, ప్రతిపత్తి సిద్ధిస్తుంది. తెలంగాణ చరిత్రతో గానీ పరిణామాలతో గానీ ప్రత్యక్ష సంబంధం లేని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని అక్కడ పెట్టడం ద్వారా తెలంగాణ భావోద్వేగాలను గాయపర్చవద్దని కోరుతున్నాం. ఎన్నికల సమయంలో మీరు తెలంగాణ సాంస్కృతిక ఆకాంక్షలను గౌరవిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఆ హామీని నిలుపుకొంటూ సెక్రటేరియట్ ఎదుట తెలంగాణ తల్లి విగ్రహాన్ని నెలకొల్పేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారికి మీరు సూచించాలని కోరుకుంటున్నాం.

తెలంగాణ ఆత్మగౌరవానికి, సాంస్కృతిక ఆకాంక్షలకు మద్దతుగా నిలుస్తారని ఆశిస్తున్నాం.

అభినందనలతో...

ప్రొఫెసర్ హరగోపాల్
డాక్టర్ నందిని సిధారెడ్డి
టంకశాల అశోక్
అల్లం నారాయణ
గోరేటి వెంకన్న
మల్లేపల్లి లక్ష్మయ్య
అయాచితం శ్రీధర్
హిమజ్వాల
(ఇరివెంటి వెంకట్రమణ)
పరాంకుశం వేణుగోపాల స్వామి
డాక్టర్ నాశేశ్వరం శంకరం
దేశపతి శ్రీనివాస్
ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి
కట్టా శేఖర్ రెడ్డి
తిగుళ్ల కృష్ణమూర్తి
కూతురు శ్రీనివాస్ రెడ్డి
ప్రొఫెసర్ దంటు కనకదుర్గ
రసమయి బాలకిషన్
సంగిశెట్టి శ్రీనివాస్
ఏలె లక్ష్మణ్
శ్రీధర్‌రావు దేశ్‌పాండే
బుద్ధా మురళి
ఎస్జీవీ శ్రీనివాస్ రావు
అనిశెట్టి రజిత
ఐనంపూడి శ్రీలక్ష్మి
కొమర్రాజు రామలక్ష్మి
శ్రీదేవి మంత్రి
రాజ్యశ్రీ కేతవరపు
వెంకటేశ్వర్లు వర్ధెల్లి
మంగళంపల్లి విశ్వేశ్వర్
పెద్దింటి అశోక్ కుమార్
వేముగంటి మురళి
కందుకూరి శ్రీరాములు
మల్లావధుల విజయానంద్
డాక్టర్ ఆంజనేయ గౌడ్
బద్రి నర్సన్
శ్రీరామోజు హరగోపాల్
రమేశ్ హజారి
కాంచనపల్లి
నవీన్ ఆచారి
జూలూరి గౌరీశంకర్
వఝుల శివకుమార్
ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్
వేముగంటి మురళీకృష్ణ
ధ్యావనపల్లి సత్యనారాయణ
పెన్నా శివరామకృష్ణ
కోట్ల వెంకటేశ్వర రెడ్డి
లక్ష్మణ్‌గౌడ్
డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్
వనపట్ల సుబ్బయ్య
లక్ష్మణ్ మురారి (బందూక్)
కార్టూనిస్ట్ మృత్యుంజయ్
చిమ్మని మనోహర్
ఎదిరెపల్లి కాశన్న
డా.ఎ.జయంతి
స్వర్ణ కిలారి
బోల యాదయ్య
కె.వీరయ్య
యన్.బాల్ రాం
ఉప్పల తిరుమలేష్
అమర్ నాథ్
చిక్కొండ్ర రవి
బైరోజు చంద్రశేఖర్
బైరోజు రాజశేఖర్
బైరోజు శ్యాంసుందర్
వహీద్ ఖాన్
వేదార్థం మధుసూదన శర్మ
ఆర్.రత్నాకర్‌రెడ్డి,
సి.హెచ్.ఉషారాణి
బెల్లంకొండ సంపత్ కుమార్
పొన్నాల బాలయ్య
కె.అంజయ్య
సిద్దెంకి యాదగిరి
చమన్ సింగ్
కె.రంగాచారి
తైదల అంజయ్య
నాగిళ్ల రామశాస్త్రి
ఘనపురం దేవేందర్
వీరేంద్ర కాపర్తి
ప్రగతి
పరదా వెంకటేశ్వర్‌రావు
ఆచార్య పిల్లలమర్రి రాములు
సంగాని మల్లేశ్వర్...

నమస్తే తెలంగాణ

ఉమ్మడి పౌరస్మృతి

ప్రధాని నరేంద్ర మోదీ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపై నుంచి చేసిన ప్రసంగంలో దేశానికి లౌకిక పౌరస్మృతి కావాలని ప్రకటించడం ఒక విరోధాభాసలా కనిపిస్తున్నది. ఎందుకంటే, మతపరమైన రాజకీయాలకు పెట్టింది పేరైన బీజేపీ నేతగా, హిందూత్వ అతివాదిగా పేరొందిన ప్రధాని లౌకికవాదం గురించి మాట్లాడటం విచిత్రమే మరి. బీజేపీ ఇదివరకటి ఉమ్మడి పౌరస్మృతి నినాదానికి ఇది లౌకిక తొడుగు వేయడమే తప్ప మరొకటి కాదని భావించాలి. ఉమ్మడి పౌరస్మృతి విషయమై దేశంలో ఏకాభిప్రాయం లేకపోవడం, ముఖ్యంగా లౌకికవాదులంటూ బీజేపీ ఈసడించుకునే ప్రస్తుత 'ప్రధాన మిత్రపక్షాలు' దానికి అంగీకారం తెలపడం అసాధ్యం కావడం నేపథ్యంలో మోదీ ఈ కొత్త పదబంధాన్ని సృష్టించారు! అందుకే ఉమ్మడి పౌరస్మృతి విధానానికి మద్దతు కూడగట్టుకోవడంలో భాగంగానే ప్రధాని సరికొత్త రూపంలో ఆ నినాదాన్ని ప్రజల ముందు లేదా రాజకీయ పార్టీల ముందు ఉంచడానికి ప్రయత్నించారని భావించవచ్చు. ఎన్డీయే ప్రధాన మిత్రపక్షాలైన టీడీపీ, జేడీయూ పార్టీలు బీజేపీ మతపరమైన ఎజెండాకు పూర్తిస్థాయిలో మద్దతు తెలిపే అవకాశాలు అంతంతమాత్రమేననేది తెలిసిందే. ఇది పరస్పర అవసరాల ఆధారంగా ఏర్పడిన పొత్తు కావడమే అందుకు కారణం.

ప్రధాని చేసిన లౌకిక పౌరస్మృతి ప్రతిపాదనపై జేడీయూ, టీడీపీ స్పందనలు ఊహించిన విధంగానే ఉన్నాయి. 2017లో కేంద్రానికి నితీశ్‌కుమార్ రాసిన లేఖనే పౌరస్మృతిపై తమ ప్రవచిత విధానమని జేడీయూ అంటున్నది. విస్తృతస్థాయి సంప్రదింపులు, ఏకాభిప్రాయ సాధన తర్వాతనే పౌరస్మృతి మార్పు గురించి నిర్ణయం జరగాలని ఆ లేఖలో నితీశ్ పేర్కొన్నారు. కాగా, ఇంకా ఈ అంశంపై సంప్రదింపులు జరగాల్సి ఉందని టీడీపీ స్పష్టం చేసింది. ఉమ్మడి పౌరస్మృతి అయినా, లౌకిక పౌరస్మృతి అయినా ముందుగా విస్తృతస్థాయి సంప్రదింపులు జరగాలనేదే తమ అభిమతమని టీడీపీ అంటున్నది. కేంద్రం తెచ్చిన వివాదాస్పద వక్ఫ్ చట్టాన్ని టీడీపీ సమర్థించినప్పటికీ దాన్ని జాయింట్ పార్లమెంటరీ కమిటీకి నివేదించాలని సూచించడం గమనార్హం. మైనారిటీల విషయంలో ఎన్డీయేలోని ప్రాంతీయ పార్టీల విధానం, బీజేపీ విధానం ఒకేవిధంగా లేదనడానికి ఇదే నిదర్శనం. ఈశాన్య ప్రాంతానికి చెందిన బీజేపీ మిత్రపక్షాలు కూడా ఉమ్మడి పౌరస్మృతికి వ్యతిరేకమనేది ఇక్కడ గుర్తుంచుకోవాలి.

1996 నుంచి వరుసగా ఎన్నికల మ్యానిఫెస్టోల్లో ఉమ్మడి పౌరస్మృతి గురించి బీజేపీ ప్రస్తావిస్తూ వస్తున్నది. ఉమ్మడి పౌరస్మృతిపై అన్ని పక్షాల, అదేవిధంగా ప్రజల అభిప్రాయాలు తెలుసుకునేందుకు 22వ లా కమిషన్ నిరుడు ఒక నోటిఫికేషన్ జారీచేసింది. అంతకుముందు వేసిన 21వ లా కమిషన్ 2018లో విడుదల చేసిన ఒక ప్రకటనలో ఉమ్మడి పౌరస్మృతి అవసరం కాదు, వాంఛనీయమూ కాదని చెప్పడం విశేషం. అయితే ప్రధాని మోదీ మాత్రం గత 75 ఏండ్లుగా దేశం మతపరమైన పౌరస్మృతి కిందే ఉన్నదని, ఇక ఇప్పుడు లౌకిక పౌరస్మృతి వైపు మళ్లాల్సిన సమయం ఆసన్నమైందని ఎర్రకోట ప్రసంగంలో చెప్పడం గమనార్హం. రాజ్యాంగంలోని లౌకికవాద విలువల్ని కాపాడేందుకే ఉమ్మడి పౌరస్మృతి స్థానంలో లౌకిక పౌరస్మృతిని తీసుకువస్తున్నట్టు బీజేపీ నేతలు అంటున్నారు. నిజానికి ఉమ్మడి పౌరస్మృతి బీజేపీ, సంఘ్ పరివార్ మూల సిద్ధాంతాల్లో ఒకటి. సొంత బలం లేక మిత్రపక్షాల మీద ఆధారపడే పరిస్థితి రావడం వల్లే ప్రస్తుతం బీజేపీ భాష చాలా వరకు మారిందని అర్థమవుతున్నది. బీజేపీ మాట మారినట్టు పైకి కనిపిస్తున్నప్పటికీ లోపల అసలు విషయం ఉమ్మడి పౌరస్మృతేనని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు!

ప్రజావాణి అరణ్యరోదనేనా?

టంకశాల అశోక్

ఒక విషయం ఎందువల్లనో గాని అంతగా వార్తలకు ఎక్కటం లేదు. చర్చకు అంతకన్నా రావటం లేదు. దాని పేరు 'ప్రజావాణి'. రాష్ట్ర ప్రభుత్వం ఆ కార్యక్రమాన్ని ప్రకటించి ఎనిమిది నెలలు గడిచి పాతబడిపోయినందున ఎక్కువమందికి గుర్తుండకపోవచ్చు. ఆసక్తి తగ్గవచ్చు. కనుక చర్చలోకి వెళ్లేముందు ఆ విషయం ఒకసారి మననం చేసుకోవటం అవసరం. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుడు డిసెంబర్ 7వ తేదీన ఏర్పడిన వెంటనే తీసుకున్న తొలి చర్యలలో ఒకటి, గత ప్రభుత్వ పాలనలో నిర్మించిన ప్రగతి భవన్ పేరును జ్యోతిరావు పూలే భవన్‌గా మార్చి, దాని ముందున్న 'కంచెలను బద్దలు కొట్టి', ఇకనుంచి ప్రజలు అందులోకి స్వేచ్ఛగా ప్రవేశించి తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేయవచ్చునని ప్రకటించటం. ఆ విధంగా వినతిపత్రాల స్వీకరణ కార్యక్రమానికి మొదట ప్రజా దర్బార్ అనే పేరు పెట్టి, రెండురోజుల తర్వాత 'ప్రజావాణి'గా మార్చారు. ఈ చర్యలపై సర్వత్రా ప్రశంసలు రాగా, ప్రజలు తమ వినతులతో పోటెత్తటం మొదలైంది. అంతవరకు అంతా బాగున్నది. కానీ, కార్యక్రమం మొదలై ఇప్పటికి ఎనిమిది నెలలు గడిచినా ఏదీ పరిష్కారం కాక, 'ప్రజావాణి' కాస్తా అరణ్యరోదనగా మిగిలినట్లు కనిపిస్తున్నది.

ప్రజావాణిమొదలైనప్పుడు సామాన్య ప్రజలకు రెండు కారణాల వల్ల ఎనలేని ఉత్సాహం, ఆశలు కలిగాయి. ప్రగతిభవన్‌లో ప్రవేశించి తమ సమస్యలు నేరుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చెప్పుకునే అవకాశం లభిస్తున్నదనేది మొదటి కారణం. ఇందుగురించి స్వయంగా ముఖ్యమంత్రి చెప్పిన మాటలను, అధికారులకు ఇచ్చారంటున్న ఆదేశాలను విన్న మీదట, ఇక తమ వినతిపత్రం సమస్యలు సత్వరమే పరిష్కారం కాగలవన్న ఆశలు కలగటం రెండవది. మన రాష్ట్రంలో గాని, దేశంలో గాని ప్రజల సమస్యలు నిజమైనవి, ఒకవిధంగా అంతులేనివి అయినందున, పాలకులు ఆ విధమైన హామీలను ఎంతో నమ్మకంగా ఇచ్చినప్పుడు ప్రజలలో ఆశలు కూడా అదేస్థాయిలో కలగటం సహజం. పైగా వారానికి రెండుసార్లు మంగళ, శుక్రవారాలలో జరిగే కార్యక్రమానికి ముఖ్యమంత్రి స్వయంగా హాజరై దరఖాస్తులను తానే స్వీకరించగలరని ప్రకటించారు. దానితో ఆ రోజులలో ప్రజలు రాష్ట్రం నలుమూలల నుంచి ఒకరోజు ముందుగానే బయల్దేరి రావటం, కార్యక్రమం ఉదయం 10 నుంచి మొదలవుతుంది గనుక తాము వెనుకబడిపోరాదన్న ఆరాటంతో ఇంకా సరిగా తెల్లవారక ముందు నుంచే ప్రజాభవన్ వద్ద తండోపతండాలుగా చేరి బారులు తీరటం, ఆ లైన్లు రోడ్డుపైకి కూడా రావడంతో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు పడిన శ్రమ వంటివన్నీ మనం చూశాం. ప్రభుత్వ మార్పు కోసం ఎంతో కృషి చేసిన జెండా మేధావులైతే ఆనందంతో ఉబ్బితబ్బిబ్బు అయి వ్యాఖ్యానాలు చేశారు. అప్పటినుంచి ఎనిమిది నెలలు గడిచేసరికి ప్రజావాణి అరణ్యరోదనగా మిగులుతుండగా వారెందుకో ఏ వ్యాఖ్యానాలూ చేయటం లేదు. అసలు ఇటువంటి కార్యక్రమం అంటూ ఒకటున్నదనే విషయం వారికి ఇంకా గుర్తున్నదా లేక మరిచిపోయారా అనే సందేహం కలుగుతున్నది.

పైన అనుకున్నట్టు మనవంటి అంతులేని సమస్యల వ్యవస్థలో ప్రజావాణి కార్యక్రమానికి ఎటువంటి అర్జీలు వస్తాయి? ఇది అది అని గాక సకల సమస్యలపైనా వస్తాయి. అందుకు అదనంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీల పేరిట పద మూడు హామీలనిచ్చింది. ఆ విధంగా ఇతర సమస్యలు, వాటితో పాటు ఆరు గ్యారంటీలతో ప్రత్యక్ష నిమిత్తం గల సమస్యలతో రోజుకు కొన్ని వేల దరఖాస్తులు రావటం మొదలైంది. ఆ వెల్లువను చూసి కలవరపడినందుకో, సమయం లేనందుకో గాని, ప్రతిసారి రాగలరన్న ముఖ్యమంత్రి అసలు రావటం ఆపివేశారు. తన స్థానంలో వస్తారన్న మంత్రులు మానివేశారు. వారికి బదులుగా అన్న అధికారులు ఆగిపోయారు. క్లర్కులు మాత్రం మిగిలారు. ప్రతిరోజు అన్నది వారానికి రెండురోజులైంది. దరఖాస్తుల స్వీకరణను కొంతవరకు జిల్లాలకు బదిలీ చేశారు. అక్కడ ఏమవుతున్నదో ఎవరికీ తెలియదు. ఆ క్రమంలో రెండు జరిగాయి. ఒకటి ప్రజలకు ఆశలు, నమ్మకం తగ్గిపోతుండటం. రెండు, అసలు ఆ కార్యక్రమం పట్లనే చాలామందికి ఆకర్షణ లేకుండాపోవటం. పనులు జరగనప్పుడు నమ్మకాలు, ఆకర్షణ ఉండవు కదా.

ఈ పరిస్థితికి అదనంగా మరికొన్ని చేరాయి. వినతిపత్రాలు ఇచ్చినవారికి నంబర్లు ఇచ్చారు. వాటి పరిస్థితి ఏమిటో చెక్ చేసుకోవటానికి అధికారికంగా పోర్టల్‌లో ఏర్పాట్లు చేశారు. అంతవరకు బాగున్నది. కానీ సామాన్య ప్రజలలో అట్లా చెక్ చేసుకోవాలన్న మాట తెలిసింది కొందరికే.

ఈ పరిస్థితికి అదనంగా మరికొన్ని చేరాయి. వినతిపత్రాలు ఇచ్చినవారికి నంబర్లు ఇచ్చారు. వాటి పరిస్థితి ఏమిటో చెక్ చేసుకోవటానికి అధికారికంగా పోర్టల్‌లో ఏర్పాట్లు చేశారు. అంతవరకు బాగున్నది. కానీ సామాన్య ప్రజలలో అట్లా చెక్ చేసుకోవాలన్న మాట తెలిసింది కొందరికే. చెక్ చేసుకోగలవారు ఇంకా తక్కువ. తీరా చెక్ చేసుకున్నవారికి ఎంతకాలం గడిచినా తమ సమస్య పరిష్కారమైందన్నమాట కన్పించలేదు. దరఖాస్తులో ఫోన్ నంబర్లు ఇచ్చినవారికి ఏ సమాచారాలు లేవు. స్వయంగా అధికారులను కలిసినవారికి వస్తున్న సమాధానం తమకేమీ తెలియదని. ఇది ఒకటి కాగా, అసలు ప్రభుత్వం వద్ద ఒక నిర్దిష్టమైన, పారదర్శకమైన ఏర్పాట్లు లేవు. ఎన్ని దరఖాస్తులు వచ్చాయో, ఏ సమస్యకు ఎన్నో, పరిష్కారమైనవి ఏవి ఎన్నో, పరిష్కార క్రమంలో ఉన్నవి ఎన్నో, పరిశీలనలో ఉన్నవి ఎన్నో, తిరస్కరించినవి ఎన్నో నెలకొకసారి లెక్కలు ప్రకటించవచ్చు. ఆయా దరఖాస్తుదారుల ఫోన్లకు మెసేజ్‌లు పంపవచ్చు. ఇటువంటి బాధ్యతాయుత వ్యవహరణ వల్ల పారదర్శకత కలుగుతుంది. ప్రజలకు విశ్వాసం ఏర్పడుతుంది. ఇంకా తమ పనులు కానివారు కూడా ఆశాభావంతో ఓపికపడతారు. కానీ ప్రభుత్వం ఇవేమీ చేయటం లేదు.

ప్రజావాణి వంటి కార్యక్రమానికి ఒక స్వభావం, ఒక నీరియస్ లక్ష్యం ఉంటాయి. అది కోట్లాది జన సామాన్యపు జీవన సంఘర్షణలకు సంబంధించినది అయినందున దానిని ప్రవేశపెట్టడమంటే తేనెతుట్టెను కదిలించటమే. అంతే తప్ప అది రాజకీయ అవసరాల రొమాన్స్ కాదు. అందులో గ్లామర్ ఉండదు. అందువల్ల, ఒక పాలకునికి సీరియస్‌నెస్, నిజాయితీ ఉంటే ఇవన్నీ ముందుగానే ఆలోచించాలి. అందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలి. మధ్యలో సమీక్షలు జరపాలి. కాని ప్రజావాణి కార్యక్రమాన్ని ఎనిమిది నెలల క్రితం ప్రకటించిన పటాటోపపు తీరును చూసినా, తర్వాత ఎనిమిది నెలలుగా అది అమలవుతున్న పద్ధతిని గమనించినా ఇందులో కనీసం రొమాన్స్ అయినా కనిపించటం లేదు. రాజకీయ వంచనా కళ తప్ప. ఈసరికి ఆ కళ సైతం వెలవెలబోతున్నట్టు కనిపిస్తున్నది. ఈ మాటపై సందేహాలున్న జెండా మేధావులు ఒకసారి ప్రజాభవన్‌కు వెళ్లి అక్కడి దరఖాస్తుదారులు చూపించే అద్దంలో తమ మొహాలు చూసుకోవచ్చు.

నిజానికి సీరియస్‌గా ఆలోచిస్తే, దరఖాస్తుదారుల సమస్యల పరిష్కారం ఎంతమాత్రం తేలిక కాదు. అవన్నీ ఎక్కువగా ఇళ్లు, భూములు, ఉద్యోగాలు, ఆరోగ్య సమస్యలు, రెవెన్యూ వివాదాలు, పోలీసు కేసుల వంటి వాటికి సంబంధించినవి. వాటి పరిష్కారం ఏ ప్రభుత్వానికైనా కష్టమే. కొన్ని ఇప్పటికిప్పుడు అసాధ్యం కూడా. వీటిలో అత్యధికం సాధారణ పరిపాలనాక్రమంలో అభివృద్ధి క్రమంలో తేలవలసినవే తప్ప వ్యక్తుల వారీగా కాదు. ఏవో కొన్నింటికి తప్ప గడువులు కూడా వీలు కాదు. అందువల్ల కావలసింది చిత్తశుద్ధి గల పాలన, అభివృద్ధి. కాని మన రాష్ట్రంలో గాని, ఉమ్మడి రాష్ట్రంలో గాని, దేశంలో గాని మొదటినుంచి గల పరిపాలనా వ్యవస్థలు, ఆర్థిక-రాజకీయ-సామాజిక వ్యవస్థలు, రాజకీయ పార్టీలూ ప్రభుత్వాల స్వభావాలు, స్వప్రయోజనాలు, నిజాయితీరాహిత్యాలు అనేకానేక ప్రజా సమస్యలను పరిష్కరించకుండా అరకొర చర్యలతో మభ్యపెట్టి సాగదీసి దాటవేస్తున్నాయి. పరిష్కారాలు తేలిక కాదని ప్రభుత్వ నాయకులకు, అధికార యంత్రాంగానికి పూర్తిగా తెలుసు. అయినప్పటికీ 'ప్రజావాణి' వంటి దాటవేత కార్యక్రమాలతో ప్రజలకు భ్రమలు కల్పిస్తుంటారు. పైన పేర్కొన్న పరిస్థితుల వల్ల, ఆ భ్రమాత్మక కార్యక్రమాలు విఫలమయ్యే పరిస్థితులు కూడా వాటిలో అంతర్నిహితంగా ఉంటాయి. కనుక అది చివరికి అరణ్యరోదనగా మిగలటం అనివార్యమవుతుంది. ఇటువంటి అనుభవాల నెగెటివ్ ప్రభావాలు ప్రజలపై సూక్ష్మస్థాయి (మైక్రోలెవెల్)లో ఉంటాయి.